క్లుప్తంగా

కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకట్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే కోటా నుంచి నిధులు కేటాయించాలని కోరారు. పలు పనులకు అంచనా వ్యయం ప్రతిపాదనలు కేటీఆర్‌కు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముస్తాబాద్: మండలంలోని ముస్తాబాద్, పోతుగల్, బందనకల్, మోహినికుంట, నామాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ విష్ణుతేజ తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ పనుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న దేవరాజు, తదితరులు

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన పిట్టల రమేశ్ కుటుంబానికి బోయిని దేవరాజు ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థికసాయం, 50 కిలోల బియ్యం అందజేశారు. రమేశ్ ఇటీవల ద్విచక్రవాహనం అదుపు తప్పి పొలంలో పడి మృతిచెందాడు. అతడికి ఇల్లు కూడా లేకపోవడంతో కుటుంబసభ్యులు టెంట్ వద్దే ఉంటున్నారు. వారి దీనస్థితి గురించి తెలుసుకున్న దేవరాజు వారికి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఆకుల నాగరాజు, వంకాయల ప్రశాంత్, దండు ఎల్లయ్య, దండు శంకర్, అనిల్, తుమ్మల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘డ్రైనేజీ నాణ్యత లోపంపై చర్యలు తీసుకోవాలి’

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో ఇటీవల చేపట్టిన డ్రైనేజీ నాణ్యత లోపంపై చర్యలు తీసుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోతుగల్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సమీపంలో నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ పనుల మొదటి దశలోనే నాణ్యత లోపం ఉందని ఇంజినీరింగ్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన సదరు కాంట్రాక్టర్, అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పది కాలాలపాటు ఉండాల్సిన నిర్మాణాల్లో ఇకపై నాణ్యత లోపం లేకుండా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రజక సంఘం అధ్యక్షుడిగా నవీన్



నవీన్, లింబాద్రి

వీర్నపల్లి: వీర్నపల్లి గ్రామంలో సోమవారం రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తకొండ నవీన్, ఉపాధ్యక్షుడిగా పోతారం లింబాద్రి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, తమ ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు అంజయ్య, భూమయ్య, రమేశ్, తిరుపతి, శ్రీనివాస్, నాగరాజు, నవీన్, రాములు, నగేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న కేటీఆర్ అభిమాని



ఎమ్మెల్యే కేటీఆర్ ఫ్లెక్సీతో దేవేందర్‌యాదవ్

తంగళ్లపల్లి: సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 5వ సారి ఎన్నిక కావడంతో ఓ వీరాభిమాని మొక్కు తీర్చుకున్నాడు. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ బండి దేవేందర్‌యాదవ్ సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో మొక్కు చెల్లించుకున్నాడు.

అద్దెకు పనిముట్లు

- వ్యవసాయరంగానికి ఊతం
- అన్నదాతలకు ప్రయోజనం
- మార్కెట్ కంటే తక్కువ కిరాయి
- రూ.35లక్షలతో ఆధునిక పనిముట్ల కొనుగోలు



స్ప్రేయర్లు



అందుబాటులో ఉన్న పనిముట్లు

ఎల్లారెడ్డిపేట: అన్నదాతలపై ఆర్థికభారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అద్దె పనిముట్లను అందుబాటులోకి తెచ్చింది. అవసరమైన పనిముట్లను తక్కువ ధరలకే రైతులకు అద్దెకు ఇస్తూ వ్యవసాయరంగానికి ఊతం ఇస్తున్నారు. సన్న, చిన్నకారు వ్యవసాయదారులకు చేయూత నివ్వాలనే సదాశయంతో ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా రూ.35 లక్షలు వెచ్చించి పనిముట్లను కొనుగోలు చేశారు. మండల కావేరి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాలయం వెనుక ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తైవాన్ స్ప్రేయర్లు 10, గడ్డి చుట్టే యంత్రాలు 3, ట్రాక్టర్ 1, రొటవేటర్లు 3, విత్తనాలు, మందులు చల్లే యంత్రాలు 2, కల్టివేటర్ (నాగళ్లు) 3 చొప్పున అందుబాటులోకి తెచ్చారు. రైతులకు అవసరమైన యంత్రాలను గంటలు, రోజుల చొప్పున తక్కువ అద్దెపై ఇస్తూ వ్యవసాయ రంగానికి చేయూతనందిస్తున్నారు.

24 యంత్రాలు రూ.35 లక్షలు

రైతులకు అత్యవసరంగా ఉపయోగపడే ఆధునిక వ్యవసాయ యంత్రాలను ముందుగా అందుబాటులోకి తెచ్చారు. రూ.35 లక్షలు వెచ్చించి వివిధ రకాల 24 యంత్రాలను కొనుగోలు చేశారు. వరి పండిస్తున్న క్రమంలో ట్రాక్టర్ నాగళ్లు కలుపుతీసే యంత్రాలు, పురుగుల నివారణకు పిచికారీ చేసే డబ్బాలు, రొటవేటర్లు, తేమశాతం కొలిచే యంత్రాలు ఇలా అవసరమైన వ్యవసాయ పనిముట్లను తొలుత అద్దె ప్రతిపాదికన అందిస్తున్నారు. అద్దె పనిముట్లపై ముందుగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. బహిరంగా మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు యంత్రాలను అద్దెకు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. రెండెకరాల కన్న తక్కువగా వ్యవసాయ భూమి ఉండి పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పనిముట్లను అద్దెకు ఇస్తున్నారు.

అద్దె ఇలా..

సన్న, చిన్నకారు రైతులకు తక్కువ అద్దెకు గంటల చొప్పున ఇస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్ 8 గంటలకు రూ.150, గడ్డి చుట్టే యంత్రం ఒక్క రోజుకు రూ.2,000, రొటవేటర్ ఒక్కరోజుకు రూ.1,000, ట్రాక్టర్ ఒక ఎకరానికి మూడుసాళ్ల కోసం రూ.6,000, పవర్ టిల్లర్ ఒక్కరోజుకు రూ.1,000, విత్తనాలు, మందులు చల్లే యంత్రాలు 8గంటలకు రూ.1,500, నాగళ్లు ఒకరోజుకు రూ.800 చొప్పునా ధరలను నిర్ణయించి రైతులకు అందిస్తున్నారు. తక్కువ కిరాయిపై అద్దె పనిముట్లను వినియోగించుకొని రైతులు లబ్ధి పొందుతున్నారు.

తక్కువ అద్దె బాగుంది



పంటల దిగుబడి తక్కువగా ఉన్న సమయంలో ప్రైవేట్ పనిముట్లను అద్దెకు తీసుకోవడం కష్టంగా ఉంది. తక్కువ అద్దెతో పనిముట్లను అందించడం సంతోషంగా ఉంది. రైతులపై ఆర్థికభారం తగ్గుతుంది. అన్ని రకాల పనిముట్లను అందుబాటులోకి తేవాలి.

– బానోతు సంతోష్, రైతు, సీతారాంనాయక్ తండా

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం అద్దె పనిముట్లను అందుబాటులోకి తెచ్చింది. రైతుల అవసరాల దృష్ట్యా ప్రభుత్వం తక్కువ ధరకు ఇచ్చే యంత్రాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలి. ప్రతి రోజూ కేంద్రాన్ని తెరిచి ఉంచుతాం. తగిన ఆధారాలతో రైతులు పనిముట్లను తీసుకోవాలి.

– మల్లేశం, ఏపీఎం, ఎల్లారెడ్డిపేట

ప్రజలు సుఖశాంతులతో ఉండాలి



రుద్రంగి చర్చిలో కేక్ కట్ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి: నూతన సంవత్సరం అందరికి కలిసి రావాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. రుద్రంగిలోని చర్చిలో సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనపై విరక్తి చెంది, ప్రజల పక్షాన నిలిచే కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి తర్రె లింగం, నాయకులు గుగ్గిల్ల వెంకటేశ్, గంధం మనోజ్, ఇప్ప మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శ

మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు గడ్డం రాజవ్వ(90) సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. అలాగే ఆదివారం గుండెపోటుతో పొలం వద్దే హఠాన్మరణం చెందిన నంద్యాడపు బుచ్చిమల్లయ్య కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ ఆది పరామర్శించారు.

మనశ్శాంతికి ఆధ్యాత్మికతే మందు

కోనరావుపేట/చందుర్తి/వేములవాడఅర్బన్/సిరిసిల్లటౌన్: మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికతే మందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. పాస్టర్ స్వామిదాసు ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, బైరగోని నందూగౌడ్, మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నీరటి సురేశ్, ఎరవెల్లి విజయ్, ఎరవెల్లి నాగరాజు, బాదవేణి బాలరాజు, కాదాస్ సుధాకర్, సుంకరి రెడ్డి, సాసాల రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే చందుర్తి మండలం ఎన్గల్, మూడపల్లి చర్చిల్లో జరిగిన వేడుకల్లో ఆది పాల్గొన్నారు. చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విప్ పాల్గొని కేక్ కట్ చేశారు. సిరిసిల్ల కాంగ్రెస్, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్స్ ప్రతినిధులు విప్ ఆదిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, మ్యాన ప్రసాద్, కల్లూరి చందన, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, జ్యోతి, గంగభవాని తదితరులు పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన మున్నూరుకాపు ప్రతినిధులు



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సోమవారం ఎల్లారెడ్డిపేట మున్నూరుకాపు పట్టణ మాజీ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి కలిశారు. మున్నూరుకాపు పట్టణ సలహాదారు సాన రవి, కాంట్రాక్టర్ అజీజ్, కట్టెల బాబు, గొసుకుల రమేశ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కాంగ్రెస్‌లోకి బండారి బాల్‌రెడ్డి?

బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డిపేట పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సోమవారం కలవడం ఈ ప్రచారానికి బలం చేకూరుస్తుంది. ఇటీవల మండలంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయి. ఇదే సమయంలో బాల్‌రెడ్డి సైతం పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతండడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్యే సత్యంను కలిసిన యువకులు



ఎమ్మెల్యేకు నోటుబుక్కులు ఇస్తున్న యువకులు

బోయినపల్లి: మండలంలోని తడగొండ, మల్లాపూర్ గ్రామాలకు చెందిన పలువురు యువకులు సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధరలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలు, పుష్ప గుచ్ఛాలకు బదులుగా విద్యార్థుల కోసం తెచ్చిన నోటు బుక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు. విద్యార్థులకు నోటుబుక్కులు తెచ్చిన యువకులను ఎమ్మెల్యే అభినందించారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

గంభీరావుపేట: మండలంలోని నర్మాలలో విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతిచెందాయి. జంగం రాజుయాదవ్ తన గొర్రెలను గ్రామ శివారులోని మానేరువాగులో నీళ్ల కోసం తీసుకెళ్లాడు. అక్కడ రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు వైర్లు తగిలి గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. త్రుటిలో రాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. తనకు రూ.25వేల వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు



కనగర్తిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, ధర్మారం, సుద్దాల గ్రామాల్లో సోమవారం అయోధ్య రాముని అక్షింతలతో ఊరేగింపు నిర్వహించారు. రాముని అక్షింతలు గ్రామాలకు చేరుకోగా ఆలయాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సర్పంచులు గున్నాల అరుణ, ఉప్పుల దేవలక్ష్మి, ఎంపీటీసీ మమత, అర్చకులు కోచకంటి హరిశర్మ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి, యాదవ సంఘాల నూతన కార్యవర్గాలు



రెడ్డి సంఘం కార్యవర్గం

ముస్తాబాద్: ముస్తాబాద్ పడమటి రెడ్డి సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కుంబాల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బద్దిపడిగె ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సద్ది వెంకట్‌రెడ్డి, కోశాధికారి యెల్ల భాస్కర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి యెల్ల బాపురెడ్డి, ఆఫీస్ ఇన్‌చార్జి బద్దిపడిగె శ్రీనివాస్‌రెడ్డి నియామకం అయ్యారు. నూతన కార్యవర్గాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అభినందించారు.

యాదవ పట్టణ కార్యవర్గం

ముస్తాబాద్ పట్టణ యాదవ సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎలుసాని దేవయ్య, ఉపాధ్యక్షుడు పెంజర్ల బాలెల్లుయాదవ్, ప్రధాన కార్యదర్శి దొరగొల్ల బాలయ్యయాదవ్, కోశాధికారి పెంజర్ల కల్యాణ్, సంయుక్త కార్యదర్శి అనమేని రాజు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేసిన మాజీ అధ్యక్షుడు చెవుల మల్లేశ్‌యాదవ్‌ను సన్మానించారు.

తిప్పాపూర్‌లో ట్రాఫిక్‌జామ్



ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో సోమవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నూతన సంవత్సరం కావడం, రాజన్నను దర్శించుకునేందుకు భక్తులు వాహనాల మీద అధిక సంఖ్యలో రావడంతో ట్రాఫిక్ ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు.

అనాథ వృద్ధులకు విద్యార్థుల సాయం



నిత్యావసర సామగ్రి అందిస్తున్న విద్యార్థులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని ‘మా’ అనాథ వృద్ధాశ్రమం వృద్ధులకు స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు రూ.20 వేల విలువ చేసే నిత్యావసర సామగ్రి అందజేశారు. విద్యార్థులు తలా కొంత పోగు చేసి సాయం అందించారు. ఎనిమిదేళ్లుగా విద్యార్థులు సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం, వృద్ధుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు పెంపొందించేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకుడు మల్లుగారి నర్సాగౌడ్, ఉపాధ్యాయులు కిషన్, దేవరాజు, పద్మజ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నయాసాల్.. జోష్ ఫుల్

- జిల్లాలో మిన్నంటిన సంబురాలు



కోనరావుపేట: చర్చిలో మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్లటౌన్/వేములవాడరూరల్/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/తంగళ్లపల్లి/కోనరావుపేట: నూతన సంవత్సర వేడుకలు సోమవారం జిల్లాలో మిన్నంటాయి. కేక్‌లు కోసి ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, శివసాయిబాబా ఆలయాల్లో భక్తులు పెద్దెత్తున వచ్చి దర్శనం చేసుకున్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు వేకువజామునే వాకిట్లో రంగురంగుల ముగ్గులు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ముస్తాబాద్ సెస్ కార్యాలయంలో డైరెక్టర్ అంజిరెడ్డి కేక్ కట్ చేశారు.ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఎస్‌కే గౌస్, లింగంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గ కృష్ణమూర్తి, రాజేందర్, రాజునాయక్, చేపూరి రాజేశం, బుచ్చాగౌడ్ పాల్గొన్నారు. వీర్నపల్లిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దేవయ్య, సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, పాస్టర్ ప్రభుదాస్, యాకోబు, శంకర్ పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గుడిసె ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలోని గుడ్‌న్యూస్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ చంద్రయ్య, రాఘవరెడ్డి,తిరుపతి, సర్పంచ్ కదిరె శ్రీనివాస్, పాస్టర్లు బి.సోమయ్య, జయలక్ష్మి పాల్గొన్నారు.



సిరిసిల్లటౌన్: బీవై నగర్‌లో ముగ్గువేస్తున్న మహిళలు



తంగళ్లపల్లి: వేడుకల్లో ఎంపీపీ, నాయకులు



ఎల్లారెడ్డిపేట: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వీర్నపల్లి: ఇంటి ముందు ముగ్గు వేస్తున్న యువతి



ముస్తాబాద్: సెస్ కార్యాలయంలో..



చందుర్తి: మూడపల్లి చర్చిలో చిన్నారుల సంబరాలు

గోదాదేవికి కుంకుమ పూజ



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని సుద్దాల గ్రామంలో సోమవారం చెన్నకేశవస్వామి ఆలయంలో గోదాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. గ్రామంలోని మహిళలు అధికసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.